# అధికారులపై ధ్వజమెత్తిన కౌన్సిల్ సభ్యులు.!

**- అభివృద్ధి పనులు జరగడం లేదంటూ ఆగ్రహం**

**- పనిచేయని కాంట్రాక్టర్లను బ్లాక్ లిస్ట్‌లో పెట్టాలని డిమాండ్**

గుంతకల్లు, ఆగస్టు 29 ప్రభాతవార్త



కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న పవన్‌కుమార్‌గౌడ్

మున్సిపల్ అధికారులపై కౌన్సిల్ సభ్యులు ధ్వజమెత్తారు. తమ వార్డుల్లో అభివృద్ధి పనులు జరగడం లేదంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో కౌన్సిల్ సాధారణ సమావేశం చైర్‌పర్సన్ ఎన్.భవాని అధ్యక్షతన జరిగింది. కౌన్సిలర్లు పవన్‌కుమార్‌గౌడ్, కృపాకర్‌లు మాట్లాడుతూ నాలుగేళ్లు గడిచినా వార్డులు అభివృద్ధికి నోచుకోలేదన్నారు. టెండర్లు పూర్తయిన పనులు కూడా చేయడంలేదన్నారు. కౌన్సిల్ సమావేశాల్లో ఎన్నిసార్లు చెప్పినా అధికారులు నిర్లక్ష్యం వీడడం లేదని విమర్శించారు. అధికారుల తీరుతో వార్డుల్లో తిరగలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు ప్రతి వార్డులో 10 లక్షల చొప్పున పనులు చేయాలని ఎమ్మెల్యే చెప్పినా ప్రారంభానికి నోచుకోలేదన్నారు. ఏడాదిగా పనులు చేయని కాంట్రాక్టర్లను బ్లాక్ లిస్టులో పెట్టాలని డిమాండ్ చేశారు. పట్టణంలో పారిశుద్ధ్యం అధ్వానంగా తయారైందన్నారు. వానలకు డ్రైనేజీలు నిండి మురుగునీరు రోడ్లపై పారుతున్నా పట్టించుకునే పరిస్థితి లేదన్నారు. ఫాగింగ్ సక్రమంగా చేయకపోవడంతో దోమల వల్ల ప్రజలు రోగాల బారిన పడాల్సిన దుస్థితి నెలకొందన్నారు. అలాగే ప్రధాన రోడ్లలో కొళాయి గుంతలు తవ్వి అలాగే వదిలేస్తున్నారని, వాటిని పూడ్చడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. సుప్రీంకోర్టు గెజిట్‌ను పరిశీలించి కుక్కల బెడద నుండి ప్రజలకు రక్షణ కల్పించాలని కోరారు. ఆవుల విషయంలో కూడా అధికారులు తూతూ మంత్రంగా చర్యలు తీసుకోకుండా పరిష్కారం చూపాలన్నారు. దివ్యాంగుల పెన్షన్లపై కౌన్సిలర్ లింగన్న అధికారులను నిలదీశారు. ఏ ప్రాతిపదికన పెన్షన్లు తొలగించారో చెప్పాలని డిమాండ్ చేశారు. వెరిఫికేషన్ పేరుతో పెన్షన్లు తొలగించడంలో దివ్యాంగులు తీవ్ర ఆందోళన చెందుతున్నారన్నారు. ప్రజాధనంతో ఏర్పాటు చేసిన 40 లక్షలు విలువచేసే మోటార్లు చోరీకి గురై రెండు నెలలైనా అధికారులు పట్టనట్లు వ్యవహరిస్తున్నారన్నారు. స్పందించిన కమీషనర్ ఇద్దరు ఉద్యోగుల వేతనాలు నిలుపుదల చేశామని సమాధానం ఇచ్చారు. అంతకుముందు 35వ వార్డు కౌన్సిలర్ షరీఫ్ మృతికి సభ్యులు, అధికారులు సంతాపం తెలిపారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమీషనర్ నయీమ్‌అహమ్మద్, అసిస్టెంట్ కమీషనర్ లక్ష్మీదేవి, ఎంఈ ఇంతియాజ్ అలీ, అకౌంటెంట్ నాగలక్ష్మి, మెప్మా ప్రాజెక్ట్ ఆఫీసర్ జి.మోహన్, డిఇలు షబాన, సుమ, ప్రకాష్‌నాయుడు, టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్ బాష, ఏఈ సుదర్శన్, సిబ్బంది పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడిగా తగరం రామాంజనేయులు

గుంతకల్లు, ఆగస్టు 29 ప్రభాతవార్త



తగరం రామాంజనేయులు

కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడిగా తగరం రామాంజనేయులు ఎంపికయ్యారు. నియోజకవర్గం సమన్వయకర్త దౌల్తాపురం ప్రభాకర్ సమక్షంలో ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు షర్మిలరెడ్డి శుక్రవారం నియామక పత్రాన్ని అందజేసినట్లు తెలిపారు. ఆయన మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి తన నియామకానికి సహకరించిన నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పార్టీ సీనియర్ నాయకులు లక్ష్మినారాయణయాదవ్, చిప్స్ బాషా, పులికి రామచంద్ర, సంఘాల తిమ్మారెడ్డి, పుల్లన్న, గోవిందప్ప, మహిళా అధ్యక్షురాలు సువర్ణ రామాంజనేయులుకు అభినందనలు తెలిపారు.

# కౌన్సిల్‌లో కంటతడి పెట్టిన చైర్‌పర్సన్ భవాని

గుంతకల్లు, ఆగస్టు 29 ప్రభాతవార్త



కంటతడి పెట్టుకుంటున్న చైర్‌పర్సన్ భవాని

మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్.భవాని కౌన్సిల్ సమావేశంలో కంటతడి పెట్టారు. శుక్రవారం జరిగిన కౌన్సిల్ సాధారణ సమావేశంలో పలువురు కౌన్సిలర్లు పట్టణ సమస్యలను ఆమె దృష్టికి తెచ్చారు. వార్డుల్లో అభివృద్ధి పనులు జరగడం లేదంటూ వాపోయారు. కో ఆప్షన్ మెంబర్ ఫ్లయింగ్ మాబు కలుగచేసుకుని కౌన్సిలర్లు ఎదుర్కొంటున్న సమస్యలను చాలా రోజులుగా చైర్‌పర్సన్ దృష్టికి తెస్తున్నా పట్టించుకోవడం లేదన్నారు. దీంతో ఒక్కసారిగా భావోద్వేగానికి గురైన ఆమె కంటతడి పెట్టుకున్నారు. అధికారుల నిర్లక్ష్యం కారణంగానే తాను మాటలు పడాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇక నుండి అయినా అధికారులు అభివృద్ధి పనులు జరిగేలా చూడాలని చైర్‌పర్సన్ కోరారు. ఇదిలా ఉండగా వైసిపికి చెందిన చైర్‌పర్సన్‌పై అదే పార్టీకి చెందిన కోఆప్షన్ మెంబర్ విమర్శలు చేయడంతో సంఘటన చోటుచేసుకుంది.

## ఎంఈ ఇంతియాజ్‌తో మహిళా కౌన్సిలర్ల వాగ్వివాదం

గుంతకల్లు, ఆగస్టు 29 ప్రభాతవార్త



ఎంఈతో వాగ్వివాదం చేస్తున్న మహిళా కౌన్సిలర్లు

మున్సిపల్ ఇంజనీర్ ఇంతియాజ్‌అలీతో పలువురు మహిళా కౌన్సిలర్లు వాగ్వివాదానికి దిగారు. శుక్రవారం జరిగిన కౌన్సిల్ సాధారణ సమావేశంలో చైర్‌పర్సన్ భవాని కంటతడి పెట్టడంతో కౌన్సిలర్లు కుమారి, దర్గా చెన్నమ్మ, నీలావతి, సుజాతలు ఎంఈతో ఘర్షణకు దిగారు. మీ నిర్లక్ష్యం కారణంగానే చైర్‌పర్సన్ కంటతడి పెట్టాల్సి వచ్చిందన్నారు. వార్డుల్లో నెలకొన్న సమస్యలను ఎన్నిసార్లు అధికారుల దృష్టికి తెచ్చినా పట్టించుకోవడంలేదని ఆరోపించారు. ఇప్పటికైనా తమ తీరు మార్చుకోవాలని కోరారు. దీంతో సహనం కోల్పోయిన ఎంఈ తాను వచ్చి కేవలం రెండు నెలలు మాత్రమే అయిందని, ఇక నుండి పనులు సక్రమంగా జరగకపోతే బదిలీపై వెళతానని అసంతృప్తి వ్యక్తం చేశారు.

## ఘనంగా వినాయకుని విగ్రహాల నిమజ్జనం

కనగానపల్లి ఆగస్టు 29 ప్రభాతవార్త



మండల వ్యాప్తంగా శుక్రవారం వినాయకుని విగ్రహాలను ట్రాక్టర్ పై గ్రామాల్లో ఊరేగింపుగా డీజే పాటలతో డాన్సులు, నృత్యాలు చేస్తూ వినాయకుడి విగ్రహాలను చెరువుల్లో నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, యువకులు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ట్రాక్టర్ పై నిమజ్జనానికి తీసుకు వెళ్తున్న దృశ్యం.

# కాచికుంటలో వినాయక గెలయర భళగ అద్దూరి వార్షికోత్సవం



రంగోలి పోటి దృశ్యం

అమరాపురం ఆగష్టు 29: ప్రభాతవార్త

మండల పరిధిలోని కాచికుంట గ్రామం నందు వినాయక చవితి సందర్భంగా శ్రీ వినాయక గెలయర బలగ 14వ వార్షికోత్సవ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం గణనాథునికి ప్రత్యేక పూజా కార్యక్రమం నిర్వహించి భక్తాదులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం రంగవల్లిక పోటీలు మరియు కొన్ని సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. అలానే మ్యూజికల్ చైర్ పోటీలు, స్కిప్పింగ్, స్పూన్ బ్యాలెన్ కార్యక్రమాలను నిర్వహించారు. అదేవిధంగా శనివారం రాత్రి 9 గంటలకు సంజన మెలోడీస్ ఆర్కెస్ట్రా కళాకారులచే నృత్య పాటల ద్వారా ప్రజలను మోనో రంజింప చేసే కార్యక్రమాలు నిర్వహించినట్లు శ్రీ వినాయక సేవా సమితి నిర్వాహకులు తెలిపారు. శనివారం క్రికెట్, వాలీబాల్, కార్యక్రమాల నిర్వహించనున్నట్లు రాత్రి 9 గంటలకు సంజన మెలోడీస్ ద్వారా ప్రజలను మనోరంజింపచేసే ఆర్కెస్ట్రా కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఆదివారం చెట్లు నాటే కార్యక్రమం చేసిన అనంతరం సాయంత్రం నాలుగు గంటలకు పురవీధుల గుండా స్వామివారిని ఊరేగింపు చేసి నిమజ్జన కార్యక్రమం అనంతరం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు కాచి కుంట శ్రీ వినాయక గెలయరా బలగ యువకులు తెలిపారు. అత్యధికంగా భక్తులు హాజరై స్వామివారి కృపకు పాత్రులు కావాలని వారు కోరారు.

## ఘనంగా తెలుగుభాషా దినోత్సవం

గుడిబండ ఆగష్టు 29 ప్రభాతవార్త



తెలుగు అధ్యాపకులను సన్మానిస్తున్న దృశ్యం

మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతిరావు పూలే బాలికల గురుకుల కళాశాలలో తెలుగు భాషా దినోత్సవాన్ని ప్రిన్సిపాల్ ప్రసాద్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తెలుగు అధ్యాపకులు శివలింగప్ప మాట్లాడుతూ పూర్వ కాలంలో తెలుగు భాష రాజభాష గా కనకాభిషేకం పొంది నేడు మాతృభాషల సరసన చేరిందని ఆవేదన వ్యక్తంచేశారు. అలాగే గిడుగు వెంకట రామ్మూర్తి పంతులు తెలుగు భాష అభివృద్ధికి చేసిన సేవలను విద్యార్థులకు వివరించారు. తదనంతరం తెలుగు అధ్యాపకులు శివలింగప్ప ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రిన్సిపాల్ లలిత, అధ్యాపకులు ప్రమీల, శ్రీనివాస్, అనురాధ, విద్యార్థినీయులు కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రశాంతంగా వినాయక నిమజ్జనం వేడుకలు



నిమజ్జనానికి తీసుకువెళ్తున్న వినాయక విగ్రహం

వజ్రకరూరు ఆగస్టు 29 ప్రభాతవార్త

మండల వ్యాప్తంగా శుక్రవారం జరిగిన వినాయక నిమజ్జనం వేడుకలు ప్రశాంతంగా ముగిశాయి. ఈనెల 27న వినాయక చతుర్థి సందర్భంగా మండల వ్యాప్తంగా పెద్ద ఎత్తున మండపాలను ఏర్పాటు చేసి భారీ వినాయక విగ్రహాలను మండపాలలో కొలువుదీర్చారు. మూడు రోజులపాటు అత్యంత భక్తిశ్రద్ధలతో వేడుకలు నిర్వహించారు. శుక్రవారం నిమజ్జనానికి ముందు అన్నప్రసాద వితరణ కార్యక్రమాలను విరివిగా చేపట్టారు. విగ్రహాలను ట్రాక్టర్లలో, ఆటోలలోను కొలువు దీర్చి, డప్పులు వాయిస్తూ, చిన్న పెద్ద తేడా లేకుండాకేరింతల కొడుతూ, నృత్యాలతో సమీపచెరువులు హంద్రీనీవా ప్రధాన కాలువలో నిమజ్జనానికి తరలి వెళ్లారు. ఈ సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్ ఐ నాగ స్వామి పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసి వేడుకలను ప్రశాంతంగా ముగించారు.

## కోలా హాలంగా వినాయక నిమజ్జనం

కొత్తచెరువు ఆగస్టు 29 ప్రభాతవార్త.



వినాయక విగ్రహానికి పూజలు నిర్వహిస్తున్న ఉత్సవ సమితి కమిటీ సభ్యులు

కొత్తచెరువు మండల పరిధిలోని పలు గ్రామాలతో పాటు తలమర్ల లో వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా ప్రత్యేక మండపాలు ఏర్పాటు చేసి ప్రత్యేక అలంకరణతో వినాయక విగ్రహాలు ఏర్పాటు చేసి భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు అనంతరం గ్రామ వీధుల గుండా గణపతి పప్పా మోరియా అంటూ యువకులు మహిళలు వాల్మీకి సోదరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు వినాయక ఉత్సవ సమితి సభ్యులు భక్తాదులకు తీర్థప్రసాదాలు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు బ్యాండ్ మేళాలు డ్రమ్స్ టపాసులు పేలుస్తూ ఉత్సాహంగా కోలాహలంగా సమీపంలో ఉన్న చెరువులో గణేష్ నిమజ్జనం నిర్వహించారు గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా ప్రశాంతంగా నిమజ్జనం నిర్వహించారు.

## శ్రీ చైతన్య స్కూల్ నందు ఘనంగా తెలుగు భాషా దినోత్సవం

కొత్తచెరువు ఆగస్టు 29 ప్రభాతవార్త



విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేస్తున్న దృశ్యం.

మండల కేంద్రంలో ఉన్న శ్రీ చైతన్య స్కూల్ నందు తెలుగు భాషా దినోత్సవం ప్రిన్సిపాల్ బాలకృష్ణ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు ముందుగా త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించి తెలుగు తల్లి, గిడుగు వెంకట రామమూర్తి చిత్రపటాలను ఉంచి నివాళులర్పించారు ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ తెలుగు భాష ఔన్నత్యాన్ని విద్యార్థులకు వివరించారు దేశభాషలందు తెలుగు లెస్స అన్నారు శ్రీకృష్ణదేవరాయలు, గిడుగు వెంకట రామమూర్తి పంతులు తెలుగు భాషాభివృద్ధికి చేసిన కృషిని ఆయన సేవలను విద్యార్థులకు వివరించారు విద్యార్థిని విద్యార్థులకు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేశారు ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు విద్యార్థులు పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

# చిరస్మరణీయుడు మేజర్ ధ్యాన్‌చంద్

**జిల్లా జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్**






జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న జెసి అభిషేక్ కుమార్ ,సమావేశంలో మాట్లాడుతున్న జెసి అభిషేక్ కుమార్

పుట్టపర్తి(కలెక్టరేట్),ఆగస్టు,29, ప్రభాతవార్త

భారత క్రీడా చరిత్రలో చిరస్మరణీయుడు మేజర్ ధ్యాన్‌చంద్ అని, ఆయనను ప్రపంచం మొత్తం “హాకీ మాంత్రికుడు“ (విజార్డ్ ఆఫ్ హాకీ) అని గౌరవంగా పిలుస్తుందని జిల్లాజాయింట్ కలెక్టర్ అభిషేక్‌కుమార్ అన్నారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లోని పిజిఆర్ఎస్ సమావేశ మందిరంలో హాకీ మాంత్రికుడు“ (విజార్డ్ ఆఫ్ హాకీ) మేజర్ ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించు కుని నేషనల్ స్పోర్ట్స్‌డే కార్యక్రమం నిర్వహించా రు. తొలుత జ్యోతిప్రజ్వలన గావించి, మేజర్ ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూలమాలలువేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం ప్రార్థనగీతంతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ మాట్లాడుతూతన అద్భుతమైన ఆటతీరు, మైదానంలో చూపిన ప్రతిభతో హాకీ ఆటకు అంత ర్జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చిన మహనుభావుడు అని అన్నారు. ఆయన నాయకత్వంలో భారత హాకీ జట్టు వరుసగా 1928 (ఆమ్స్ టర్డామ్), 1932 (లాస్ ఏంజెల్స్), 1936 (బెర్లిన్) ఒలింపిక్ క్రీడల్లో మూడుబంగారుపతకాలుసాధించి ముఖ్యంగా 1936లో జర్మనీలోని బెర్లిన్‌లో జరిగిన ఒలింపిక్స్ లో హిట్లర్‌కూడా ఆయన ఆటకు ముగ్ధుడై ఆయనకు సైన్యంలో ఉన్నత స్థానం అందించడం జరిగిందన్నారు. ధ్యాన్ చంద్ ప్రతిభను గుర్తించి భారత ప్రభుత్వం 1956లో ఆయనకు “పద్మభూషణ్“ అవార్డు అందజేసింది. అలాగే ఆయన జన్మదినం ఆగస్టు 29న ప్రతి సంవత్సరం జాతీయ క్రీడా దినోత్సవంగా జరుపుకుంటారని ఇది ఆయనకు ఇచ్చిన అత్యున్నత గౌరవం అని చెప్పారు. హాకీ ఆటలో అపారమైన ఖ్యాతి గాంచాడు, జీవితాంతం ఆయన ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అయినప్పటికీ, తన దేశానికి గౌరవం తెచ్చిన వ్యక్తిగా ఆయన పేరు శాశ్వతంగా నిలిచిపోయిందన్నారు. ఆయన 3 డిసెంబర్ 1979న కన్ను మూశారని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి బి.ఉదయ భాస్కర్, జిల్లా స్కూల్ గేమ్ ఫెడరేషన్ సెక్రటరీ డి.మొరార్జీ యాదవ్, పాఠశాల ప్రధానోపాధ్యాలు, పిఈటిలు, జాతీయ స్థాయి, రాష్ట్రస్థాయిలో మెడల్స్ సాధించిన క్రీడాకారులకు మెడల్స్ మరియు ప్రశంస పాత్రలను అదనపు కలెక్టర్ చేతుల మీదుగా అందించారు. శ్రీ సత్యసాయి జిల్లా నందు అండర్ 14, 17 విభాగంలో క్రీడాకారులు ఇంటర్ డిస్టిక్ నందు దాదాపుగా 360 మంది పాల్గొనడం జరిగింది. అదేవిధంగా వివిధ క్రీడాంశాల నందు అండర్ 14, 17 క్రీడాకారులు నేషనల్‌లో శ్రీ సత్యసాయి జిల్లా నుండి దాదాపుగా 501 మంది పాల్గొనడం జరిగింది అందులో భాగంగా రాష్ట్రంలో సత్య సాయి జిల్లాలో ఉన్నటువంటి స్కూళ్లలో పనిచేస్తున్నటువంటి ఉత్తమ వ్యాయామ ఉపాధ్యాయుల కృషిని గుర్తించి ఐదు పాఠశాలలకు క్రీడల వైపున గుర్తించి పాయింట్స్ ఆధారంగా వారికి స్కూల్ ఆఫ్ స్పోర్ట్స్ ఎక్సలెన్సీ అవార్డ్స్ జెసి చేతుల మీదుగా అందించారు. ధర్మవరం మండలం చిగిచెర్ల జడ్.పి.హెచ్.ఎస్ పాఠశాల పాయింట్స్ 209 మొదటి స్థానం, లేపాక్షి మండల పులమతి జడ్పీహెచ్ఎస్ పాయింట్స్ 104తో ద్వితీయ స్థానం, బుక్కపట్నం బాలుర జడ్పీహెచ్ఎస్ స్కూల్ పాయింట్స్ 93తో తృతీయ స్థానం, పరిగి మండల కోడిగేనహల్లి ఏపీ ఆర్ ఎస్ ఓ ఎక్సలెన్సీ పాయింట్స్ 90 నాలుగోవ స్థానం, హిందుపురం ఎంజీఎం హైస్కూల్ పాయింట్స్ 88తో 5 వ స్థానంలో నిలిచారు అన్నారు. అదేవిధంగా నేషనల్‌లో పాల్గొన్నటువంటి క్రీడాకారులకు ధ్యాన్చంద్ జయంతి సందర్భంగా క్రీడాకారులకు సర్టిఫికెట్స్ మరియు మెడల్స్ జెసిచేతుల మీదుగా అందించారు. జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ నిర్వహించిన అమరావతి చాంపియన్షిప్ క్రీడల పోటీలలో సత్య సాయి జిల్లాకు జోనల్ స్థాయిలో బాక్సింగ్ విభాగంలో మొదటి బహుమతి, రాష్ట్ర స్థాయిలో ధవితీయ బహుమతి లాభీనవడం జరిగింధీ. హాకి జోనల్‌స్థాయిలో ద్వితీయ బహుమతి, బాస్కెట్ బాల్ జోనల్ స్థాయి లో ద్వితీయ బహుమతి మరియు వైట్ లిఫ్టింగ్‌లో జోనల్ స్థాయిలో మొదటి బహుమతి సాధించడం జరిగింది. అలాగే నేషనల్ స్పోర్ట్స్ డే సందర్భంగా జిల్లా నుండి రాష్ట్ర, అంతర్జాతీయ స్థాయిలో పాల్గొన్న క్రీడాకారులకు జ్ఞాపికలను అందచేశారు. ఈ కార్యక్రమంలో డిఎస్డీఓ ఉదయ భాస్కర్, కోచ్లు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

# తాడిపత్రిలో వినాయక నిమజ్జనం వేడుకలపై ఏఎస్‌పి ప్రత్యేక దృష్టి



ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న ఏఎస్‌పి

తాడిపత్రిటౌన్, ఆగస్టు 29 ప్రభాతవార్త

తాడిపత్రి మండలంలో వినాయక నిమజ్జనం వేడుకలపై ఏఎస్‌పి రోహిత్‌కుమార్‌చౌదరి ప్రత్యేక దృష్టి సారించారు. మండల వ్యాప్తంగా సమస్యాత్మకంగా ఉన్న ప్రాంతాల్లో స్వయంగా ఏఎస్‌పి రోహిత్‌కుమార్‌చౌదరి క్షేత్రస్థాయిలో పర్యటించి పర్యవేక్షణ చేస్తున్నారు. ముఖ్యంగా ఆలూరు, చిన్నపొలమడ, సజ్జలదిన్నె గ్రామాల్లో సిఐ శివగంగాధర్‌రెడ్డి, ఎస్ఐ ధరణిబాబులతో కలిసి బందోబస్తు నిర్వహిస్తున్నారు.

## బుద్ధుని రూపంలో ఆకట్టుకుంటున్న గణేశుడు

తాడిపత్రిటౌన్, ఆగస్టు 29 ప్రభాతవార్త



బుద్ధిని ఆకారంలో వినాయకుడు

తాడిపత్రి పట్టణంలోని శ్రీరాములు పేటలో వినాయకుడు బుద్ధుని రూపంలో దర్శనమిస్తున్నారు. వినాయకచవితి ఉత్సవాల్లో భాగంగా ఏకదంతాయ యూనియన్ చరణ్ అగర్‌బత్తి ఫ్యాక్టరీ దగ్గర బుద్ధుని రూపంలో ఉన్న వినాయకుని ప్రతిమను ఏర్పాటుచేశారు. కాలనీవాసులు భక్తిశ్రద్ధలతో పూజలు చేస్తున్నారు. భక్తులు స్వామివారినిదర్శించుకొని అల్పాహారంప్రసాదంగా స్వీకరించారు.

## ఘనంగా జాతీయ క్రీడా దినోత్సవం

తాడిపత్రిటౌన్, ఆగస్టు 29 ప్రభాతవార్త



విద్యార్థులకు బహుమతులు అందచేస్తున్న కౌన్సిలర్ మల్లికార్జున

తాడిపత్రి పట్టణంలోని ప్రభుత్వ పాఠశాలలో శుక్రవారం జాతీయ క్రీడా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి 30వవార్డు కౌన్సిలర్ మల్లికార్జున ముఖ్య అతిధిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశ్వవిఖ్యాత క్రీడాకారుడు మేజర్ ధ్యాన్ చంద్ జయంతిని క్రీడా దినోత్సవంగా జరుపుకోవడం మనందరికి గర్వకారణమన్నారు. క్రీడా దినోత్సవం పురస్కరించుకుని ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు బహుమతులు అందచేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం శైలజ, పిడి కేశవమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా తెలుగు భాషా దినోత్సవం

తాడిపత్రిటౌన్, ఆగస్టు 29 ప్రభాతవార్త



కార్యక్రమంలో మాట్లాడుతున్న కౌన్సిలర్ మల్లికార్జున

తాడిపత్రి పట్టణంలోని ప్రభుత్వ హై స్కూల్‌లో గిడుగు వెంకటరామమూర్తి జయంతిని పురస్కరించుకుని తెలుగు భాషా దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమానికి 30వవార్డు కౌన్సిలర్ మల్లికార్జున ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆ రోజుల్లో గ్రంథ రచన అంటే గ్రాంధిక భాషలో వుండేదని ఆ రచనలు పండితులకే తప్ప మామూలు ప్రజలకు అర్థమయ్యేవి కావని గిడుగు వెంకటరామమూర్తి ఉద్యమ ఫలితంగా వాడుక భాషలోనే ఈరోజు మనమంతా చదువుకుంటున్నాం, రచనలు చేస్తున్నామన్నారు. అంతటి గొప్ప మేధావి గిడుగు వెంకటరామమూర్తి తెలుగు భాషపై ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం శైలజ, కవి నందవరం కేశవరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# డిఎస్‌సి పరీక్షలో మెరిసిన ఆణిముత్యం మెరుపురి చంద్రశేఖర్

అమడగూరు, ఆగస్టు 29 ప్రభాతవార్త



మెరుపురి చంద్రశేఖర్

ఆమడగూరు గ్రామానికి చెందిన మెరుపురి చంద్రశేఖర్ డిఎస్‌సిలో ఎంపికయ్యాడు. చంద్రశేఖర్ అమడగూరు ఏఆర్ కానిస్టేబుల్‌గా పనిచేస్తూ కొద్ది రోజులు క్రితం రాజీనామా చేసి పట్టుదలతో కష్టపడి చదివి డిఎస్‌సిలో స్కూల్ అసిస్టెంట్ 88 ర్యాంక్, ట్రైన్డ్ గ్రాడ్యుయేట్ 257ర్యాంక్‌తో ఉద్యోగం సంపాదించాడు. తమ కుమారునికి ఉద్యోగం వచ్చినందుకు తల్లితండ్రులు, కుటుంబం సభ్యులు సంతోషం వక్తంచేశారు. చంద్ర మాట్లాడుతూ విద్య నేర్పిన గురువులు తన తోటి స్నేహితులుకు అభినందనలు తెలిపారు. తాను ఈ ఉన్నత స్థానానికి రావడానికి సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపాడు.

## ప్రశాంతంగా వినాయకుని నిమజ్జనం

అమడగూరు, ఆగస్టు 29 ప్రభాతవార్త



వినాయకుని విగ్రహాలను ఊరేగిస్తున్న దృశ్యం



పోలీసులు బందోబస్తు నిర్వహిస్తున్న దృశ్యం

మండలంలోని వివిధ గ్రామాల్లో వినాయకుని నిమజ్జనం శుక్రవారం ప్రశాంతంగా నిర్వహించారు. నల్లమాడ సిఐ నరేంద్ర రెడ్డి ఆధ్వర్యంలో స్థానిక ఎస్ఐ ప్రదీప్‌రాజ్, పోలీస్ సిబ్బంది గ్రామాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు గొడవలు జరగకుండా పూర్తి బందోబస్తు నిర్వహించారు. నిమజ్జనం సమయంలో ఆయా గ్రామ పెద్దలు ముందుండి కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామాల వద్ద ఆయా చెరువుల కట్టల వద్ద పోలీసులు రహదారులు ఏర్పరిచి బందోబస్తు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు యువత మహిళలు చిన్నారులు ఒకరికొకరు రంగులు చల్లుకుంటూ సంతోషంగా పాల్గొన్నారు.

# డెంగ్యూ పాజిటివ్ కేసు గృహాన్ని సందర్శించిన అధికారులు

పెద్దవడుగూరు, ఆగస్టు 29 ప్రభాతవార్త

మండలంలోని మిడుతూరు గ్రామంలో శుక్రవారం జిల్లా మలేరియా అధికారి ఓబులు పర్యటించి డెంగ్యూ పాజిటివ్ కేసు గృహాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా డిఎంఓ మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు, మలేరియా, డెంగ్యూ, గన్యా జ్వరాలు, ఫ్రైడే డ్రైడే ఆవశ్యకత గురించి ప్రజలకు తెలియజేశారు. అలాగే దోమ కాటు వల్ల సంభవించే వ్యాధులు ప్రబలకుండా వ్యాధి తీవ్రత ఉన్న గ్రామాల్లో హెల్త్ అసిస్టెంట్లు పర్యటించి ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. గ్రామాల్లో పర్యటించని సిబ్బందిపట్ల తాము కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో గుత్తి మలేరియా సబ్ యూనిట్ అధికారి ప్రభాకర్, పెద్దవడుగూరు పిహెచ్‌సి సూపర్‌వైజర్ శ్రీనివాసులు, ఆరోగ్య కార్యకర్తలు బాలగంగాధర్‌రెడ్డి, శివప్రసాద్, ఏఎన్ఎం సుమలత, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.



వివరాలు తెలుసుకుంటున్న అధికారులు

# 30 మంది లబ్ధిదారులకు రూ.15.62 లక్షలు సీఎంఆర్ఎఫ్ సాయం

## -చెక్కులను పంపిణీ చేసిన టీడీపీ సీనియర్ నాయకులు పయ్యావుల శ్రీనివాసులు

**ఉరవకొండ, ఆగస్టు 29 ప్రభాతవార్త**



లబ్ధిదారుకు సీఎంఆర్ఎఫ్ సాయం చెక్కును అందిస్తున్న టీడీపీ సీనియర్ నేత పయ్యావుల శ్రీనివాసులు

ఉరవకొండ నియోజకవర్గంలోని విడపనకల్లు, వజ్రకరూరు మండలాలకు చెందిన 30 మంది లబ్దిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) కింద రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ చొరవతో మంజూరైన 15,62,556 రూపాయల చెక్కులను తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు పయ్యావుల శ్రీనివాసులు శుక్రవారం పంపిణీ చేశారు. జిల్లా కేంద్రం అనంతపురంలోని తన స్వగృహంలో ఆయన లబ్దిదారులకు చెక్కులను అందించి కష్టాల్లో ఉన్నవారికి ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. విడపనకల్లు మండలం గడేకల్లుకు చెందిన బి.వెంకటేశులు 80,857 రూపాయలు, ఉండబండకు చెందిన కురుబ మల్లమ్మ 28,400 రూపాయలు, హావళిగికి చెందిన బి.గోవిందు 84,928 రూపాయలు, విడపనకల్లుకు చెందిన సింగాడి అజయ్‌కుమార్ 1,48,908 రూపాయలు, పాల్తూరుకు చెందిన చిన్నప్పగారి హనుమంతరాయుడు 1,27,891 రూపాయలు, కొట్టాలపల్లికు చెందిన కురుబ సరోజమమ 30,000 రూపాయలు, కురుబ చిన్న వన్నూరప్ప 53,420 రూపాయలు, మాసినేని పెద్ద నారాయణప్ప 21,093 రూపాయలు, పొత్తూరి చంద్రమౌళి 47,200 రూపాయలు, బోయ ఆదెన్న 15,000రూపాయలు, జి.వనిత21,960రూపాయలు, వడ్డే ఎర్రమ్మ 30,000రూపాయలు, వడ్డేఅనూష 20,250రూపాయలు, వడ్డే రామాంజినేయులు 1,00,000రూపాయలు, ఆర్.కొట్టాలకుచెందిన పొత్తూరి రంగమ్మ 25,900రూపాయలు, జనార్ధనపల్లికుచెందిన ఆర్.నాగ భూషణం 41,049 రూపాయలు చెక్కునుఅందుకున్నారు. వజ్రకరూరుమండలకేంద్రానికి చెందిన లింగంశెట్టి రామాంజినేయులు 41,084రూపాయలు, వడ్డేసంజమ్మ 33,752 రూపాయలు, వీపీపీ తండాకు చెందిన గవిడి తిరుపాల్‌నాయక్ 76.265 రూపాయలు, కొనకొండ్లకు చెందిన యు.గోపాలకృష్ణ 70,000 రూపాయలు, దాసరి తరుణ్ 30,000 రూపాయలు, ఎన్ఎన్‌పీ తండాకు చెందిన రమావత్ సోమ్లాబాయ్ 20,000రూపాయలు, జరుట్ల రాంపురంకు చెందిన వడ్డే సుంకమ్మ 23,920 రూపాయలు, కమలపాడుకు చెందిన యు.సరస్వతి 60,972 రూపాయలు, పీసీ కొత్తకోటకు చెందిన టైలర్ షాహిదా 23,400 రూపాయలు, వడ్డే లావణ్య 30,028 రూపాయలు, పందికుంటకుచెందిన కావలిజ్యోతి 30,600రూపాయలు, వెంకటాంపల్లికు చెందిన పూలకుంట వన్నూరుస్వామి 52,016 రూపాయలు, ఛాయాపురంకు చెందిన మాలపాటి వెంకటరమ ణమ్మ 1,51,301 రూపాయలు, గూళ్యపాళ్యంకు చెందిన వేపమాను జయలక్ష్మి 42,362 రూపాయలు చెక్కును అందుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆయా మండలాలకు చెందిన తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఘనంగా జాతీయ క్రీడా దినోత్సవం

## -ధ్యాన్‌చంద్ చిత్రపటంతో జెడ్పీ సెంట్రల్ హైస్కూల్ విద్యార్థుల ర్యాలీ -ఏపీ స్కూల్ గేమ్స్, రాష్ట్ర, జాతీయస్థాయి క్రీడాకారులకు సర్టిఫికేట్ల ప్రదానం

**ఉరవకొండ, ఆగస్టు 29 ప్రభాతవార్త**



జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా హాకీ పితామహుడు మేజర్ ధ్యాన్‌చంద్ చిత్రపటంతో క్రీడాకారులు, హెచ్ఎం రాజేశ్వరి, పీడీలు మారుతీప్రసాద్, రాఘవేంద్ర

పట్టణంలోని జిల్లా పరిషత్ సెంట్రల్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం జాతీయ క్రీడా దినోత్సవం ఘనంగా జరిగింది. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రాజేశ్వరి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎంఈవో ఈశ్వరప్ప, ఎంఈవో-2 రమాదేవి ముఖ్య అతిథులుగా హాజరుకాగా హాకీ పితామహుడు మేజర్ ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించిన అనంతరం గత ఏడాది ఏపీ స్కూల్ గేమ్స్ రాష్ట్ర, జాతీయస్థాయి క్రీడాపోటీల్లో పాల్గొన్న పాఠశాలకు చెందిన క్రీడాకారులకు సర్టిఫికేట్లను అందజేశారు. అనంతరం ధ్యాన్‌చంద్ చిత్రపటంతో కూడిన బ్యానర్, జాతీయ జండాలను చేతబట్టి విద్యార్థులు పట్టణ వీధుల్లో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ మేజర్ ధ్యాన్‌చంద్ హాకీ క్రీడలో దేశానికి అందించన పతకాలు, చేసిన సేవలను విద్యార్థులకు వివరించారు. సెపక్‌తక్రా క్రీడాకారులు బాల్స్, నెట్లతో చేసిన విన్యాసాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల ఫిజికల్ డైరెక్టర్లు మారుతీప్రసాద్, రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా గణపతి నిమజ్జనం

**అగళి, ఆగస్టు 29 ప్రభాతవార్త**



నిమజ్జనం చేస్తున్న దృశ్యం

గణపతి చతుర్ది సందర్భంగా వీధుల్లో, వాడల్లో బొజ్జగణపయ్యలను ఏర్పాటు చేసి ఘనంగా పూజలు నిర్వహించారు. గణపయ్యను వివిధ రకాల పూలతో, విద్యుత్‌దీపాలతో గణపతి మంటపాల దగ్గర అలంకరించారు. గణపయ్యకు ఇష్టమైన కుడాలను, లడ్డులను తయారు చేసి వరసిద్ధి గణపతి ముందు ఉంచారు. ఐ తొనసనపల్లి గ్రామంలో నిమజ్జనం సందర్భంగా కరిముఖ గణపతిని రంగురంగు కాగితాలతో, విద్యుత్ దీపాలతో అలంకరించి నృత్యాలు చేస్తూ నిమజ్జనం చేశారు. ఈడిగవీధి, హరిజన వాడలకు సంబంధించిన గణపయ్యలను సైతం ట్రాక్టర్‌పై ఉంచి నిమజ్జనం చేశారు. నిమజ్జనం అనంతరం భక్తులకు ప్రసాదాన్ని వితరణ చేశారు.

# రైతులకు క్యాటిల్ ఫీడ్‌ను పంపిణీ చేసిన ఎంపిపి, జడ్పిటిసి

**అగళి, ఆగస్టు 29 ప్రభాతవార్త**

అగళి పశువైద్య శాల వద్ద రైతులకు క్యాటిల్ ఫీడ్‌ను జడ్పిటిసి ఉమేష్, ఎంపిపి రేణుకా కామరాజులు పంపిణీ చేశారు. ఇది బస్తా ధర 1116 అయితే సబ్సిడి పోను 555 రూపాయలకు రైతులకు పంపిణీ చేస్తున్నట్లు వెటర్నరీ అధికారి శజవన్న తెలిపారు. 50 కెజిల బస్తా 555 రూపాయలు అని మండలానికి ఈ దాణా 400 టన్నులు సరఫరా అయిందని, దీనిని రైతులకు సరఫరా చేసినట్లు తెలిపారు. దీనిని సద్వినియోగం చేసుకుని రైతులు పాల ఉత్పత్తిలో మంచి ఫలితాలు సాధించాలని ఎంపిపి రేణుకా కామరాజు, జడ్పిటిసి ఉమేష్ అన్నారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్ తిప్పేస్వామి, సింగిల్ విండో అధ్యక్షులు కుమారస్వామి, నాయకులు షౌకతలి, శివన్న, రాజ్‌గోపాల్, రమేష్, వెటర్నరీ సిబ్బంది పాల్గొన్నారు.



పంపిణీ చేస్తున్న జడ్పి టిసి, ఎంపిపి

# కరాటే క్రీడాకారులను అభినందించిన కలెక్టర్ చేతన్.

**ధర్మవరం రూరల్ ఆగస్టు 29 ప్రభాతవార్త**



విద్యార్థులకు సర్టిఫికెట్ ప్రధానం చేస్తున్న కలెక్టర్

సత్య సాయి జిల్లాలో కలెక్టర్ చేతన్ చేతుల మీదుగా ధర్మారం కరాటే క్రీడాకారులను అభినందించడం జరిగిందని కరాటే జూడో కోచ్ ఇనాయత్ భాషా తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జాతీయ క్రీడల దినోత్సవం సందర్భంగా పుట్టపర్తిలో కలెక్టర్ అధ్యక్షతన జరిగిందని, ఈ కార్యక్రమానికి జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ తో పాటు జిల్లా క్రీడల డి.ఎస్.డి.ఓ ప్రభు హాజరు కావడం జరిగింది అన్నారు. కరాటే ప్రదర్శన చూసిన అనంతరం వీరి చేతులు మీదుగా సర్టిఫికెట్లను జాతీయ మెడల్స్ ను అందజేశారు. అనంతరం కలెక్టర్, జాయింట్ కలెక్టర్లు మాట్లాడుతూ చదువుతోపాటు క్రీడల పట్ల కూడా చక్కటి శ్రద్ధను కనపరచాలని, కరాటే వల్ల చక్కటి ఆరోగ్యం కూడా లభిస్తుందని తెలిపారు. కరాటే అనేది ఒక వ్యాయామం లాంటిదని తెలిపారు. జాతీయస్థాయి సర్టిఫికెట్స్ వలన క్రీడాకోటాలు మూడు శాతం రిజర్వేషన్ ఉండటం వల్ల విద్యార్థులకు మరెన్నో విధాలుగా ఉపయోగపడుతుందని తెలిపారు. తదుపరి కోచ్ వినాయక భాషను కూడా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ అభినందించారు.

# వైభవంగా వినాయక నిమజ్జనోత్సవం

**బత్తలపల్లి, ఆగస్టు 29 ప్రభాతవార్త**



చిత్రావతిలో నిమజ్జనం చేస్తున్న వినాయకుని విగ్రహాలు

మండల కేంద్రమైన బత్తలపల్లిలో కొలువైన వినాయక విగ్రహాలను శుక్రవారం భక్తులు వైభవంగా నిమజ్జనం చేశారు. వినాయక పర్వదినాన్ని పురష్కరించుకుని మూడు రోజులు పాటు ఉత్సవాలను నిర్వహించారు. ఈ ఉత్సవాలు శుక్రవారం అత్యంత వైభవంగా ముగిశాయి. స్థానికంగా ఏర్పాటు చేసిన వినాయక విగ్రహలను ట్రాక్టర్లలో వినాయక విగ్రహాన్ని ఉంచుకుని ఊరేగింపు నిర్వహించారు. చివరి రోజు కూడా పలు విగ్రహాలవద్ద నిర్వహకులు భక్తులకు అన్నదానకార్యక్రమాలను నిర్వహించారు. ఉట్టి ఏర్పాటు చేసి ఉట్టిని యువకులు కొట్టడాన్ని ఉత్సాహంగా తిలకించారు. విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన లడ్డులను వేలం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయగా అవి ఆలరించాయి. రంగులు చల్లుకుంటూ కేరింతలతో ఉల్లాసంగా గణనాథుని విగ్రహాలను నిమజ్జనం చేశారు. ఎటువంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా ఎస్ఐ సోమశేఖర్. ఎఎస్ఐలు సోమశేఖర్ మూర్తి, తిరుపాలు, వెంకటేష్ తమ సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు. రామాపురం సమీపంలోని చిత్రావతినదిలో నిమజ్జనంచేశారు. అదేవిధంగా మండలంలోని పలు గ్రామాలల్లో నిమజ్జనం వేడుకలు ప్రశాంతంగా జరిగాయి.

# వినాయక నిమజ్జనంలో అపశృతి

## నీటి లోతు చూసి వెనక్కి వచ్చే సమయంలో ఈదలేక మృతి

**బత్తలపల్లి, ఆగస్టు 29 ప్రభాతవార్త**



మృతి చెందిన హేమంత్ కుమార్ ఫైల్ ఫోటో

ధర్మవరం టౌన్ మాధవ నగర్ కు చెందిన బత్తుల శ్రీనివాసులు పెద్ద కొడుకు హేమంత్ కుమార్ (21) మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. శుక్రవారం పోలీసులు విలేకరులతో మాట్లాడుతూ తన స్నేహితులు తో కలసి హేమంత్ కుమార్ తమ వీధిలోని వినాయక విగ్రహం నిమజ్జనం చేసేందుకు శుక్రవారం మధ్యాహ్నం సమయం లో సంగమేశ్వర గుడి దగ్గర గల చిత్రావతి బ్రిడ్జ్ వద్దకు వెళ్లాడన్నారు. అక్కడ నీటి లోతు చూసి తిరిగి వెనక్కి వచ్చే క్రమం లో ఈదలేక నీటి లో మునిగిపోయి చనిపోయినాడని మృతుడి తండ్రి ఇచ్చిన పిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

# వైభవంగా వినాయక చవితి వేడుకలు

**తాడిమర్రి ఆగస్టు 29 (ప్రభాతవార్త)**



మోదుగులకుంట గ్రామంలో ప్రత్యేక అలంకరణలో దర్శనమిస్తున్న గణనాథుడు

మండల వ్యాప్తంగా వినాయక చవితి వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. విద్యుత్ దీపాలతో మండపాలను సర్వాంగ సుందరంగా అలంకరణ చేసి గణనాథులకు ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించారు. తిరుమలాపురం(మోదుగులకుంట) గ్రామంలో ఏర్పాటుచేసిన గణనాథులు భక్తులకు కనువిందు చేసి విశేష పూజలు అందుకున్నారు. వినాయక చవితి వేడుకలకు హాజరైన భక్తులకు వినాయక సేవా సమితి ఆధ్వర్యంలో తీర్థప్రసాదాలతో పాటు అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు. వినాయక చవితి వేడుకల సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జిల్లా ఎస్పీ వి రత్న ఆదేశాల మేరకు సిఐ శ్యామ్ రావు, ఎస్సై కృష్ణవేణిల ఆధ్వర్యంలో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసి మండల ప్రజలకు తగిన సూచనలు సలహాలు ఇచ్చారు.

# ఘనంగా తెలుగు భాషా దినోత్సవం

**మడకశిర ఆగస్టు 29 ప్రభాతవార్త;**



ఫ్లకార్డులతో విద్యార్థులు

మండల పరిధిలోని బుళ్లసముద్రం గ్రామంలోని శ్రీసూర్యవిద్యానికేతన్ పాఠశాలలో శుక్రవారం తెలుగుభాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పట్టణంలోవిద్యార్థులు ఉపాధ్యాయులుకలిసి ర్యాలీనిర్వహించి అమరాపురం బస్టాండ్‌నందు మానవహారంగాఏర్పడ్డారు. అనంతరం ఉపాధ్యాయులు తెలుగుభాషా దినోత్సవంగురించి వివరించారు. మాతెలుగుతల్లికి మల్లెపూదండ మా కన్నతల్లికి మంగళారతులు అంటూ గీతాలాపనచేస్తూ తెలుగు భాషను తెలుగు తల్లిని తలచుకొని ప్రతి ఒక్క తెలుగువారు జరుపుకొనే పండుగ తెలుగు భాషా దినోత్సవమని తెలుగు భాష గొప్పతనాన్ని తెలియజేశారు. ప్రపంచంలో అత్యధికంగా మాట్లాడే వ్యవహారిక భాష తెలుగేనని తెలిపారు. దేశ భాషలందు తెలుగు లెస్స అని తెలుగు భాష గొప్పతనాన్ని విద్యార్థులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ పివి.శిల్ప, పి.హర్షవర్ధన్‌రెడ్డి, విద్యార్థులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఉపాధ్యాయులు

# రోగులకు మెరుగైన వైద్య సేవలను అందించండి..!

## జిల్లా కలెక్టర్ టి.ఎస్.చేతన్

**ధర్మవరం రూరల్ ఆగస్టు 29 ప్రభాతవార్త**



హాస్పిటల్ పరిసరాలను పరిశీలిస్తున్న కలెక్టర్

రోగులకు మెరుగైన వైద్యసేవలను అందించాలని జిల్లా కలెక్టర్ టి.ఎస్. చేతన్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఆకస్మికంగా ధర్మవరం ఏరియా ప్రభుత్వ ఆసుపత్రిని తనిఖీ చేశారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిలోని వివిధ రికార్డులను వారు పరిశీలించారు. తదుపరి ఆసుపత్రిలోని వివిధ వార్డులను, వార్డులలో వైద్య చికిత్సలు పొందుతున్న రోగులను వారు నేరుగా మాట్లాడారు. ప్రభుత్వ ఆసుపత్రిలో అందుతున్న వైద్యం గురించి రోగులను అడిగి తెలుసుకున్నారు. మందుల స్టాక్, రికార్డుల నిర్వహణ, శుభ్రత, సిబ్బంది హాజరు వివరాలను పరిశీలించారు. ఎన్టీఆర్ వైద్య సేవ కౌంటర్ ను తనిఖీ చేసి పలు సూచనలు, ఆదేశాలు జారీచేశా రపేద ప్రజల ఆరోగ్యం చాలా కీలకమని, ఆసుపత్రికి వచ్చే ప్రతి రోగికి మెరుగైన వైద్య సేవలు అందించాల్సిన బాధ్యత మీపై ఉందన్నారు. శుభ్రత విషయంలో ఎలాంటి రాజీపడకూడదన్నారు. అనంతరం ఆసుపత్రిలో 100 పడకల సదుపాయం ఉన్నప్పటికి ఓ.పి. విభాగం మరింత విశాలంగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ధర్మవరం ఆర్డీవో మహేష్, మున్సిపల్‌కమిషనర్ ప్రమోద్‌కుమార్, వైద్యులు, తదితరులు పాల్గొన్నారు.

# ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ క్యాంప్

**శ్రీ సత్యసాయి జిల్లా (వైద్యము) ఆగస్టు 29 ప్రభాతవార్త:**

శ్రీ సత్య సాయి బాబా పూర్వ విద్యార్థుల పాలియేటివ్ కేర్ సెంటర్ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 4న 35 సంవత్సరాలు పైబడిన మహిళల కోసం ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ శిబిరం నిర్వహించనున్నారు. ఈ శిబిరం ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 3 గంటల వరకు జరుగుతుంది.స్క్రీనింగ్ కోసం ముందస్తు నమోదు తప్పనిసరి. నమోదు చేసుకోవాలనుకునే వారు 08047103700 కు కాల్ చేసి పేరు నమోదు చేసుకోవాలని నిర్వాహకులు తెలిపారు. పేరు నమోదు చేసి అపాయింట్‌మెంట్ ఎస్ ఎం ఎస్ పొందిన వారికి మాత్రమే స్క్రీనింగ్ చేయనున్నారు. ఈ శిబిరం ద్వారా ముందస్తు స్క్రీనింగ్ మరియు తగిన చికిత్సతో క్యాన్సర్ భారాన్ని తగ్గించడమే ప్రధాన లక్ష్యమని నిర్వాహకులు తెలిపారు. ప్రతి నెల మొదటి గురువారం ఇలాంటి క్యాంపులు నిర్వహించనున్నట్లు తెలిపారు.ప్రస్తుతం శ్రీ సత్య సాయి పాలిటెక్టివ్ కేర్ సెంటర్ పుట్టపర్తి పరిధిలో 50 కిలోమీటర్లలోని ప్రాంతాలలో 750 మంది క్యాన్సర్ మరియు దీర్ఘకాలిక రోగాలతో బాధపడుతున్న వారికి వారి ఇళ్లలో మరియు కేంద్రంలో ఉచిత పాలియేటివ్ కేర్ సేవలను అందిస్తోంది. ఈ సదవకాశాన్ని ప్రజలు ఉపయోగించుకోవాలన్నారు.

# ఇందిరమ్మ కాలనీలో వైభవంగా వినాయక నిమజ్జన వేడుకలు

**అమరాపురం ఆగస్టు 29 ప్రభాతవార్త**



వినాయక ఊరేగింపు దృశ్యం

మండల కేంద్రమైన అమరాపురం నందు సిరా రోడ్డు లోని న్యూ ఇందిరమ్మ కాలనీ హిందూ యువసేన యూత్ వినాయక సేవా సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం వినాయక నిమజ్జన వేడుకలు వైభవంగా జరిగింది. వినాయకుని అర్చకులు విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా రంగు రంగుల పూలతో పాటు విద్యుత్ దీపాలతో అలంకరణ చేసిన ట్రాక్టర్లో వినాయకుని ప్రతిష్టాపన చేసి ప్రధానవీధులగుండా వివిధ సాంస్కృతికకార్యక్రమాలు నిర్వహిస్తూ ఊరేగింపు నిర్వహించారు. అనంతరం విచ్చేసిన భక్తులకు పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా స్వామివారి నిమజ్జనం కార్యక్రమాన్ని వినాయక సేవా సమితి సభ్యులు కాలువనిలోని నాయకుల సమక్షంలో నిర్వహించారు. వినాయక యూత్ సంఘం సభ్యులు జస్వంత్, వినయ్, శివ,ఉదయ్,మను, స్థానిక నాయకులు ఎంపిటిసి నాగభూషణ్, బిల్డింగ్ కాంట్రాక్టర్ రాజశేఖర్, బిల్డింగ్ కాంట్రాక్టర్ ఈర క్యాథరాయప్ప, వీరలింగప్ప, టీస్టాల్ సిద్దేశ్వర తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# వైభవంగా గణపతి నిమజ్జనం

## - గణపతి బప్పా మోరియా అంటూ మారుమ్రోగిన గ్రామాలు

**చెన్నేకొత్తపల్లి, ఆగస్టు 29 ప్రభాతవార్త**



నిమజ్జనానికి గణనాథులను తీసుకెళ్తున్న దృశ్యం

మండల వ్యాప్తంగా శుక్రవారం వినాయక విగ్రహాలను భక్తులు నిమజ్జనాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. గత మూడు రోజులపాటు గ్రామాలలో పూజలు అందుకున్న వినాయక విగ్రహాలను ఎంతో భక్తి శ్రద్ధలతో వాహనాల ద్వారా ఊరేగింపు నిర్వహించారు. ప్రత్యేకంగా మండల కేంద్రమైన చెన్నేకొత్తపల్లిలో భారీ గణపతి విగ్రహాలను ఏర్పాటు చేసి, మూడు రోజులు పాటు, మండపాల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే భజన, భక్తి పాటలతో, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. శుక్రవారం భక్తులు, రంగులు చల్లుకుంటూ, బాణసంచా పేలుస్తూ, డీజే పాటలతో ఆనందోత్సవాల మధ్య నిమజ్జనాన్ని ఘనంగా జరుపుకున్నారు. గ్రామంలో ఎటువంటి అవాంఛనీయసంఘటనలు జరగకుండా పోలీసులు గట్టిబందోబస్తు నిర్వహించడంతో గణేష్ నిమజ్జనం ప్రశాంతంగా ముగిసింది.

# ప్రశాంతంగా గణేష్ నిమజ్జనం

**గుత్తి, ఆగస్టు 29 ప్రభాతవార్త**



గణేష్ విగ్రహాలను ఊరేగిస్తున్న దృశ్యం

మతసామరస్యాలకు ప్రత్యేకంగా నిర్వహించుకునే వినాయక చవితిని పురస్కరించుకొని శుక్రవారం గణేష్ నిమజ్జనాన్ని ప్రజలు శాంతియుతంగా నిర్వహించుకున్నారు. గుత్తి, గుత్తి ఆర్ఎస్ పట్టణాలతో పాటుగా గ్రామీణ ప్రాంతాల్లో దాదాపు 200కు పైగా వినాయకుని విగ్రహాలను ఏర్పాటుచేశారు. మూడురోజులపాటు ఈ ఉత్సవాలను ఘనంగా నిర్వహించుకున్నారు. అనంతరం వివిధ శాఖల అధికారులు సంయుక్తంగా గుర్తించిన వినాయక ఘాట్లలో గణేష్ నిమజ్జనం కొనసాగింది. పెద్దఎత్తున భక్తులు తరలివచ్చి ర్యాలీగా నిమజ్జనంలో పాల్గొన్నారు. గుత్తి చెరువు, సూర సింగన్నపల్లి చెరువు, లచ్చానుపల్లి వంక, తురకపల్లి కుంట, పత్తికొండ రోడ్డులో ఉన్న కుంటల్లో గణపతులను నిమజ్జనం చేశారు. ఈ మేరకు మున్సిపల్ అధికారులు నిమజ్జనానికి కావాల్సిన ఏర్పాట్లు చేశారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అర్బన్ సిఐ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఎస్ఐ సురేష్‌బాబు సిబ్బంది భారీగా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ర్యాలీలో స్వయంగా వారు పాల్గొని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. యువకులు, మహిళలు, చిన్నారుల కోలాహలం నడుమ గణేష్ నిమజ్జనం వైభవంగా జరిగింది. కాగా ఊరేగింపులో ఎలాంటి అవాంఛనీయ, భద్రతా సమస్యలు ఉత్పన్నం కాకుండా పోలీస్ శాఖ ముందస్తు చర్యగా మద్యం దుకాణాలను బంద్ చేయించారు.

# కోలాహలంగా గణేశ నిమజ్జన వేడుకలు

**అనంతపురం రూరల్,ఆగస్ట్ 29ప్రభాతవార్త**



వినాయకుని విగ్రహాన్ని ఊరేగిస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు యువకులు

అనంత రూరల్ మండలం రాచానపల్లి పంచాయితీ సిండికేట్ నగర్ లో వినాయక చవితి సందర్భంగా ఏర్పాటు చేసిన గణేష్ విగ్రహాలను శుక్రవారం నిమజ్జన కార్యక్రమం కోలాహలంగా నిర్వహించారు. రూరల్ పోలీసుల ఆదేశాల మేరకు నియమ నిబంధనలు పాటిస్తూ గణేష్ ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో గణేష్ విగ్రహాలను ట్రాక్టర్ లో అమర్చి గ్రామాల్లో మేళతాళాలతో దప్పుల నడుమ యువకులు ఆనందంతో గణేష్ నిమజ్జన కార్యక్రమాని ఘనం గా నిర్వహించారు.పంచాయితీలో ఏర్పాటు చేసిన గణేష్ విగ్రహాలను నిమజ్జ నాకి యువకులు అంగరంగ వైభవంగా తప్పెట్లు, మేళతాలాల మధ్య వీదు ల్లోని ఇంటింటికి గణనాథున్ని తీసుకెళ్లి కొబ్బరికియలు కొట్టి గ్రామంలోని మహిళలు మొక్కులు తీర్చుకున్నారు. ఈ నిమ జ్జన కార్యక్రమంలో యువ కులు, పిల్లలు కేరిం తలు కొడు తూ రంగులు చల్లుకుంటూ ప్రశాం తంగా గణనాధుని నిమజ్జనం చేశారు. ఈ నిమజ్జన కార్యక్రమంలో ఎలాంటి ఆవాం ఛనీయ సంఘటనలు జరగకుండా రూరల్ సిఐ, ఎస్ఐలు, తన సిబ్బందితో గట్టి బందోబస్తు ఏర్పాటు చేసి నియజ్జనం సజావుగా జరిగే విధంగా చర్యలు తీసుకున్నారు.

# గంగమ్మ ఒడికి గణపయ్య.. బై బై గణేశా...

**అనంతపురం రూరల్, ఆగస్ట్ 29 ప్రభాతవార్త**



నిమజ్జనానికి తరలిస్తున్న గణేష్ విగ్రహాలు

అనంత రూరల్ మండల వ్యాప్తంగా వినాయక చవితి సందర్భంగా ఏర్పా టు చేసిన గణేష్ విగ్రహాలను శుక్రవారం నిమజ్జన కార్యక్రమం రూరల్ మండలంలోని గ్రామ గ్రామాన నిర్వహించారు. రూరల్ పోలీసుల ఆదేశాల మేరకు నియమ నిబంధనలు పాటిస్తూ గణేష్ ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో గణేష్ విగ్రహాలను ట్రాక్టర్లో అమర్చి గ్రామాల్లో మేళతాళాలతో దప్పుల నడుమ యువకులు ఆనందంతో గణేష్ నిమజ్జన కార్యక్రమాని ఘనంగా నిర్వ హించారు. రూరల్ గ్రామాలు అయిన రాచానపల్లి, కొడిమి, నరస యనకు ట, అక్కంపల్లి, ఎ. నారాయణపురం, కామారుపల్లి, చిన్నంపల్లి, కురుకుంట, కక్కలపల్లి కాలనీ, రుద్రంపేట, కట్టకింపల్లి, ఆలమూరు, కక్కలపల్లి, కాటిగా నికాలువ, రాజీవ్ కాలనీ, అనంతరూరల్, ఉప్పరపల్లి, ఆకుతో టపల్లి, ఇటుక లపల్లి, చియ్యేడు, కందుకూరు, కట్టకిందపల్లి, గ్రామాల్లో ఏర్పాటు చేసి న గణేష్ విగ్రహాలను నిమజ్జనాకి యువకులు అంగరంగ వైభవంగా తప్పెట్లు, మేళతాలాల మధ్య వీదుల్లోని ఇంటిం టికి గణనాథున్ని తీసుకెళ్లి కొబ్బరి కి యలు కొట్టి గ్రామాలల్లోని మహిళలు మొక్కులు తీర్చుకున్నారు. ఈ నిమజ్జన కార్యక్రమంలో యువకులు, పిల్లలు కేరింతలు కొడుతూ రంగులు చల్లుకుం టూ ప్రశాంతంగా గణనాధుని నిమజ్జనం చేశారు. ఈ నిమజ్జన కార్యక్రమంలో ఎలాంటి ఆవాంఛనీయ సంఘటనలు జరుగకుండా రూరల్ సిఐ, ఎస్ఐలు, తన సిబ్బందితో గట్టి బందోబస్తు చర్యలు తీసుకున్నారు.

# వినాయకుని లడ్డూను రూ. 22 వేలకు దక్కించుకున్న ఉట్టి బాలకృష్ణ



వేలంపాటలో లడ్డూను దక్కించుకొని తీసుకు వెళుతున్న ఉట్టి బాలకృష్ణ తదితరులు.

**అనంతపురం రూరల్, ఆగస్ట్ 29 ప్రభాతవార్త**

అనంత రూరల్ మండలం రాచనపల్లి పంచాయతీ సిండికేట్ నగర్ లో వినాయక చవితి సందర్భంగా వినాయకుని మండపంలో ఏర్పాటుచేసిన లడ్డు ను వేలంపాట నిర్వహించగా ఆ వేలంపాటలో పలువురు పాల్గొని వేలం నిర్వహించగా ఆ వేలంలో అత్యధికంగా రూ. 22 వేలుపాట పాడి వినాయకుని లడ్డూను రాప్తాడు నియోజకవర్గ చేనేత విభాగ అధ్యక్షులు ఉట్టి బాలకృష్ణ దక్కించుకొని స్వామివారి ఆశీస్సులు అందుకుని లడ్డుతోపాటు తీర్థప్రసాదాలు అందుకున్నాడు. స్వామివారి లడ్డు వేలంలో దక్కించుకోవడంతో కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, వైఎస్ఆర్సిపి నాయకులు కార్యకర్తలు ఆనందం వ్యక్తం చేశారు.

# పిల్లలను బిక్షాటనకు కాకుండా బడులకు పంపాలి



పిల్లల తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం.

**అనంతపురం రూరల్, ఆగస్ట్ 29 ప్రభాతవార్త**

అనంతపురం రూరల్ మండల పరిధిలోని రాచానపల్లి గ్రామ సమీపంలో జోగుల గుడిసెలకు సీడీపీఓ ఉమా శంకరమ్మ ఆధ్వర్యంలో సూపర్వైజర్ భారతి రాచానపల్లి పరిధిలోని అంగన్వాడీ టీచర్లు బృందంగా కలిసి వెళ్లి అక్కడ గుడిసెలు వేసుకొని నివసిస్తున్న ప్రజలను సర్వే చేసి వారిలో గర్భవతులు బాలింతలను ఏడు నుండి మూడు సంవత్సరాల పిల్లలను ప్రీస్కూల్ పిల్లలను అంగన్వాడీ కేంద్రంలో నమోదు చేయించుకునేలా అవగాహన కల్పించారు.మరియు వీరికి పరిశుభ్రత పైన సీజనల్ వ్యాధుల పైన అవగాహన కల్పించడం జరిగింది బడి ఈడు పిల్లలు బడిలోనే ఉండాలని, ఎవరు భిక్షాటనకు వెళ్లరాదని సిడిపిఓ ఉమాశంకరమ్మ తెలియజేశారు.

# సచివాలయాన్ని శుభ్రం చేయించిన అధికారులు

**గుంతకల్లు, ఆగస్టు 29 ప్రభాతవార్త**

వార్త ప్రభావం



పట్టణంలోని వాల్మీకి సర్కిల్ వద్ద ఉన్న 17వ సచివాలయాన్ని అధికారులు శుభ్రం చేయించారు. "పాడుబడ్డ బంగ్లాను తలపిస్తున్న సచివాలయం" అన్న కథనాన్ని గురువారం వార్త దినపత్రిక ప్రచురించింది. దీంతో స్పందించిన మున్సిపల్ అధికారులు శుక్రవారం పారిశుద్ధ్య కార్మికులతో సచివాలయం పరిసరాలను శుభ్రం చేయించారు.

సచివాలయం పరిసరాలను శుభ్రం చేస్తున్న దృశ్యం →

